క్లుప్తంగా

పండగలు సంప్రదాయాలకు ప్రతీక

● మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



బోనాల జాతరలో మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని కొత్తూరు మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మైసమ్మ బోనల జాతరలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామస్తులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండగలతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల మధ్యన బంధాలు మరింత బలోపేతం అవుతాయన్నారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

మొయినాబాద్‌రూరల్: ఫార్మడీ చదివిన విద్యార్థులు ఆరోగ్య విభాగంలో ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తారని అస్టార్ ప్రైమ్ హాస్పిటల్ సీనియర్ న్యూరో సర్జరీ వైద్యులు రంగనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని భాస్కర ఫార్మసీ కళాశాలలో ఫార్మడీ పూర్తి చేసిన విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి జెవి కృష్ణారావు, డాక్టర్ రంగనాథన్ ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ గోల్డ్ మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మడి చదివిన విద్యార్థులకు మారుతున్న కాలానికి అనుగుణంగా భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.శ్రీనివాసరావు, భాస్కర మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చందుబాషా, ఫార్మడి హెచ్‌వోడీ డాక్టర్ కిషోర్‌బాబు, ఏవో సాయినాథ్, డాక్టర్ సుస్మిత, డాక్టర్ ఉదయ్‌చంద్రిక, డాక్టర్ ఆది, డాక్టర్ నరోత్తంరావు, డాక్టర్ సబితసాహా, డాక్టర్ లలిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విలీనం చేయొద్దని నిరసన

ఆర్డీఓకు వినతి పత్రం అందజేత



ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న జన్వాడ గ్రామస్తులు

శంకర్‌పల్లి: తమ గ్రామాన్ని గ్రేటర్, మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని కోరుతూ శుక్రవారం శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అనంతరం మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహా, మాజీ వార్డు సభ్యులు చేవెళ్ల ఆర్డీఓ సాయిరాంని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యులు వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామాన్ని గ్రేటర్, మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని, చేస్తే భారీ ఎత్తున పోరాటం చేపడుతామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



నందిగామ: మాట్లాడుతున్న లక్ష్మీబాయి

కొందుర్గు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టాలని, తల్లి పాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు.

నందిగామ: బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తప్పని సరిగా తల్లిపాలు ఇవ్వాలని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి పేర్కొన్నారు. రంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి తల్లి పాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. నాట్కో ప రి శ్రమ ప్రతినిధి సూర్యనారాయణ, కార్యదర్శి వెంకటేశ్, ఏఎన్ఎం రేణుక, పాల్గొన్నారు.

ప్రత్యేక బహుమతి

షాద్‌నగర్‌రూరల్: ఆపద సమయంలో ఆదుకునేందుకు 30 సంవత్సరాలుగా రక్తదానం చేయిస్తున్న యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక బహుమతి అందుకున్నారు. శుక్రవారం జేఎన్టీయూ ఆడిటోరియంలో ప్రొఫెసర్ భాగ్యలక్ష్మి యువసత్తా లక్ష్మణ్‌కుమార్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సమాజంలో జరుగుతున్న సమస్యలపై, అక్రమాలపై స్పందిస్తున్న ఆయనను అన్నా ఫౌండేషన్ నిర్వాహకులు అభినందించారు.

అప్రమత్తతే రక్ష!

● విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి
● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణానికే ముప్పు
● ముందస్తు చర్యలతో ప్రమాదాలు నివారించొచ్చు: ఏఈ నరేందర్‌నాయక్



షాబాద్: వర్షాకాలంలో ఎక్కువగా విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే సరి, లేనట్లయితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని షాబాద్ విద్యుత్‌శాఖ ఏఈ నరేందర్‌నాయక్ హెచ్చరించారు. ముందస్తు చర్యలు, అప్రమతత్తతో విలువైన ప్రాణాలను రక్షించుకోవచ్చని చెబుతున్నారు. తడి చేతులతో స్విచ్ బటన్ నొక్కడం, తెగిపోయిన కేబుల్ వైర్లను చేత పట్టుకోవడం, జోరువాన కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాన్ని ముట్టుకోవడం, ఇంట్లో ఉన్న విద్యుత్ వైర్లపై తడి బట్టలను ఆరేయడం వంటి చర్యలు ప్రాణాలమీదికి తెస్తాయి. ఇలాంటి విషయాల్లో అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలంటున్నారు. విద్యుత్ లైన్లు మీద చెట్ల కొమ్మలు, దుస్తులు, కవర్లు, ఫ్లెక్సీలు పడితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం చేరవేయాలి. విద్యుత్ సమాచారం ఇచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని ఆయన వివరించారు. వర్షాకాలంలో ప్రజలు, రైతులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, సలహాలు వెల్లడించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● వర్షం కురుస్తున్న సమయంలో లేదా వర్షం తగ్గిన వెంటనే ఎట్టి పరిస్థితుల్లో కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దు.
● ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు కరెంట్ తీగల కింద నిలబడడం, నడవడం చేయొద్దు.
● వర్షం పడుతున్నప్పుడు సెల్‌ఫోన్ ఛారింగ్ పెట్టొద్దు. సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయాలి.
● విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను తాకొద్దు. ఎక్కడైన చెట్ల కొమ్మలు కరెంట్ తీగలకు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంట నే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
● ఇంటిపైకి ఎక్కినప్పుడు కరెంట్ తీగల సమీపానికి వెళ్లొద్దు. తీగలపై పడిన దుస్తులను కర్రలతో కానీ లోహంతో తయారు చేసిన రాడ్లతో కానీ తీయొద్దు.
● వర్షం పడుతున్న సమయంలో ఆరుబయట ఉన్న విద్యుత్ వైర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మరమ్మతులు చేయరాదు.

ఇళ్లల్లో...

● ఇంట్లో ఉన్న స్విచ్‌లను, ఇతరాత్ర కరెంట్ వస్తువులను పిల్లలు ముట్టుకోకుండా చర్యలు తీసుకోవాలి.
● తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను, వైర్లను ముట్టుకోవద్దు.
● ఇంట్లో ఉన్న వాటర్‌హీటర్, రైస్‌కుక్కర్, స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే ముట్టుకోవాలి.
● ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంటే డిష్ కనెక్షన్ తొలగించడం మంచిది.
● ఇంట్లో ఎక్కడైనా విద్యుత్‌వైర్లకు ఇనుప వస్తువులు తగులుతున్నాయో చూడాలి. ఎక్కడైనా ఇనుప వస్తువుకు వైర్లు తగులుతున్నట్లు గ్రహిస్తే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి తొలగించే చర్యలు చేపట్టాలి.
● ఇంట్లోకి వచ్చే సర్వీసు వైర్ డ్యామేజ్ అయితే ఆలస్యం చేయకుండా మరమ్మతులు చేయించుకోవాలి. సాధ్యమైనంత వరకు కొత్త సర్వీసు వైర్ ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.
● ప్రతి ఇంట్లోనూ విధిగా ఎర్త్ వైర్ ఏర్పాటు చేసుకోవాలి. అదేతీరుగా ప్రతీ కరెంట్ వస్తువుకు ఎర్త్ వైర్ బిగించుకోవడం శ్రేయస్కరం.



తాళ్లపల్లిలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

వ్యవసాయ భూముల వద్ద...

● వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు రోజువారీగా అప్రమత్తంగా ఉండాలి. బోరు పంపు వద్ద, వ్యవసాయ బావుల వద్ద తడి చేతులతో స్టార్టర్‌ను తాకొద్దు.
● విద్యుత్ వైర్ల కింద ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబడొద్దు. తెగిపడిన విద్యుత్ తీగలవైపు వెళ్లడం కానీ, పశువులను మేపడం కానీ చేయొద్దు.
● వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ తీగలు సరిచేయడంగానీ, తడి చేతులతో ట్రాన్స్‌ఫార్మర్లలోని ఫ్యూజులు తీయడం వంటి పనులు చేయకూడదని ఏఈ పలు సూచనలు చేశారు.

మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

● శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్



షాద్‌నగర్: మొగిలిగిద్ద గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం శాసనమండలిలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శాసన మండలిలో మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి లాంటి ప్రముఖులు మొగిలిగిద్ద గ్రామంలో పాఠశాల విద్యను అభ్యసించారన్నారు. చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలను కలిపి మొగిలిగిద్దను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య శ్రీ పథకంలో తలసేమియా వ్యాధిగ్రస్తులను చేర్చాలని డిమాండ్ చేశారు. మాదాసి, మాదారి కురుమలు ఎస్సీ ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాలని ఎన్నో ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నారనే విషయాన్ని సభ దృష్టికి తెచ్చారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, ప్రజ్వల సంస్థ సభ్యులతో రవిచంద్రకుమార్‌రెడ్డి తదితరులు

కేశంపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఐసీడీఎస్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణ'పై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... మహిళలు స్వీయరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ సురేష్ కుమార్ మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రజ్వల సంస్థ 28 ఏళ్లుగా పని చేస్తూ 28,600ల మంది మహిళలను రక్షించి పునరావాసం కల్పించినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో జాగృతి సంఘాలను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా మానవ అక్రమ రవాణా సమాచారం తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ సునీత కృష్ణన్‌ను పద్మశ్రీ అవార్డుతో సత్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దివ్య, శమంతకమణి, ప్రజ్వల ప్రతినిధులు అనిల్‌కుమార్, అంబర్‌సింగ్, మిథాళి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్సులో శంకర్‌పల్లి అధికారులు

శంకర్‌పల్లి: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘాలు, వార్డు సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి దీని ఉద్దేశం వివరించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను గాడిన పడే చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ ప్రదేశాలను గుర్తించి, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. విధుల్లో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. కాన్ఫరెన్సులో శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, ఎంపీడీఓ వెంకయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైద్యాధికారి రేవతిరెడ్డి, వ్యవసాయాధికారి సురేష్‌బాబు, చేవెళ్ల, మొయినాబాద్ ఎంపీడీఓలు సంధ్య, హిమబిందు తదితర మండలాధికారులు పాల్గొన్నారు.

బ్లూ క్రాస్ సొసైటీతో ఒప్పందం



బ్లూ క్రాస్ సొసైటీ టీంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మీతదితరులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద మరీ ఎక్కువైపోయింది. చాలా ఘటనల్లో పాదచారులు, వాహనదారులు గాయాలపాలయ్యారు. ఈ విషయంలో ప్రజా సంక్షేమం దృష్ట్యా శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ వారు బ్లూ క్రాస్ సొసైటీతో వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మీ, కమిషనర్ శ్రీనివాస్ ఎంఓయూ చేసుకున్నారు. మున్సిపాలిటీలోని కుక్కలను మరో చోటికి తరలించి, వాటికి యానిమల్ బర్త్ కంట్రోల్ చేస్తారని పేర్కొన్నారు. తద్వారా మున్సిపాలిటీలో కుక్కల బెడద తగ్గుతుందన్నారు. ఈ విషయంలో మున్సిపల్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలర్లు, చంద్రమౌళి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

● మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన చైర్మన్‌ను సన్మానించిన కాలనీ వాసులు

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్లు, రూ.5లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి చేపట్టనున్న పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందూటి నరేందర్ మాట్లాడుతూ విడతల వారీగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అందరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను ప్రారంభించిన చైర్మన్‌ను కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. 4వ వార్డులో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు ఆలోనిపల్లి శ్రీనివాస్‌గౌడ్, మానస యాదగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహిన్ బాబా, సాయిబాబా, యాదయ్య, జవాన్‌లు చెన్నకేశవులు, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, రవికుమార్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



ముట్పూర్‌లో పోతురాజుల విన్యాసాలు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్, రేగడిచిల్కమర్రి గ్రామాలలో శుక్రవారం బోనాలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, పసుపు, కంకుమ, వేపకొమ్మలతో అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని, బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో శివసత్తులు పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కులవృత్తులపై గళం వినిపించడం హర్షణీయం

● నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రమేష్



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కులవృత్తుల గొప్పతనాన్ని చాటుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అసెంబ్లీలో తన గళాన్ని వినిపించడం అభినందనీయమని నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రోమియో రమేష్ పేర్కొన్నారు. కులవృత్తుల గురించి అసెంబ్లీలో గొప్పగా మాట్లాడినందుకు పట్టణ చౌరస్తాలో శుక్రవారం నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చాకలి, మంగలి, కుమ్మరి తదితర వృత్తుల వారి గురించి అందరికి తెలిసే విధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గొప్పగా ప్రస్తావించారన్నారు. అయితే కులవృత్తులను కార్పొరేట్ శక్తులు హరించి వేస్తున్నాయన్నారు. దీంతో వృత్తిపై ఆధారపడి జీవనం సాగించే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక జీఓను తీసుకరావాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ రైతులందరికీ వర్తింపజేయండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

చేవెళ్ల: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి సమావేశం నియోజకవర్గ కన్వీనర్ రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని, పించన్లను పెంచుతామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కౌలు రైతులకు రైతు భరోసాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాలుగు మండలాలకు సంబంధించిన మండల కమిటీలను ఎన్నుకున్నారన్నారు. చేవెళ్ల మండల కార్యదర్శిగా ఎం. సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎండీ మక్బుల్, వడ్ల మంజుల, మొయినాబాద్ మండల కార్యదర్శిగా కె. శ్రీనివాస్, శంకర్‌పల్లి సుధీర్, షాబాద్ నక్క జంగయ్యలను కార్యవర్గ సభ్యులను, కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె. అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

● మండల ఏపీఓ సుశీల



ముర్తుజాగూడలో మొక్కలు నాటుతున్న గ్రామస్తులు, అధికారులు

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఏపీఓ సుశీల అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముర్తుజాగూడ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ పాలమాకుల కృష్ణ, నాయకులు పెంటారెడ్డి, ఔరం కృష్ణారెడ్డిలు మాట్లాడారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామంలో ప్రజలందరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటేందుకు కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరూ తమవంతుగా ఐదు మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయాదవ్, శివారెడ్డి, విక్రమ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలో అసెంబ్లీకి తరలిన మాజీ సర్పంచులు



బొల్లారం పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ సర్పంచులు

కేశంపేట: తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో రాష్ట్ర సర్పంచుల సంఘం పిలుపు మేరకు మండలం నుంచి సర్పంచులు తరలివెళ్లారు. శాంతియుతంగా నిరసన చేసేందుకు వెళ్లిన తమను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించడం బాధాకరమని మండల మాజీ సర్పంచులు తలసానివెంకట్‌రెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, కమ్మేకర్ నవీన్‌కుమార్, తొంట ఆంజనేయులు, శ్రీశైలంగౌడ్‌లు తెలిపారు.

అపూర్వం విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95 పదోతరగతి చదివిన విద్యార్థులు అజీజ్‌నగర్ సమీపంలోని ఓ ఫామ్‌హౌజ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. చదువుతోనే పేదరికం దూరం అవుతుందని చదువుకున్న పాఠశాల కోసం పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేద్దామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లగోళ్ల అశోక్‌యాదవ్, కృష్ణముదిరాజ్, యాదగిరి, రాజు, మహేష్‌గౌడ్, రవి, సంతోష్‌ముదిరాజ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సంబురాలు

● సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం



కేశంపేట: ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



మొయినాబాద్: టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కేశంపేట: ఎస్సీ వర్గీకరణ సాధించడంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన పోరాటం అమోఘమని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పును ఇవ్వడంపై శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిర్ర శ్రీను అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీలో ఎ.బి, సి,డి వర్గీకరణ కోసం 1994లో మందకృష్ణమాదిగ మాదిగ హక్కుల పోరాట సమితిని ఏర్పాటుచేసి అనేక ప్రజా ఉద్యమాలను నడిపారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్యార సురేష్, గంజాయి దశరద, చంద్రయ్య, జాను, భాస్కర్, భీమయ్య, మురళీమోహన్, మహేష్‌కుమార్, రమేష్‌రెడ్డి, పర్వతాలు, భక్తవత్సల్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మొయినాబాద్ మండల కేంద్రంలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుడు శంకర్‌రావు మాదిగ మాట్లాడారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో అంతిమంగా న్యాయమే గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్‌మాదిగ, శివకుమార్ మాదిగ, భిక్షపతి మాదిగ, భాస్కర్ మాదిగ, ప్రవీణ్‌మాదిగ, మల్లికార్జున్ మాదిగ, సంజయ్ మాదిగ, ప్రవీణ్, ప్రశాంత్, రాజు, బంటి, శ్రీనివాస్, రజినీకాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.